క్లుప్తంగా

జాబ్‌మేళాలో 28 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో న్యాక్ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు 3 కంపెనీల ప్రతినిధులచే ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 59 మంది యువతీ యువకులు పాల్గొన్న ఈ జాబ్‌మేళాలో 28 మంది ఉద్యోగాలను పొందారు.

అయోడిన్ లోపంపై కళాజాతా

శింగనమల: మండలంలోని లోలూరు, ఆకులేడు, మదిరేపల్లి గ్రామాల్లో శనివారం అయోడిన్ లోపంపై కళాజాతా నిర్వహించారు. అయోడిన్ లోపం వలన కలిగే అనారోగ్య సమస్యలను ఫేస్ కళాజాతా బృందం సభ్యులు కళా ప్రదర్శన చేశారు. అనంతరం ఐజీటీ జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య , సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్ రహీనా, పోతులయ్య అయోడిన్ గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు




ఆధార్ సేవలు పొందుతున్న విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న శ్రీ సాయి జూనియర్ కాలేజీలో శనివారం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, సచివాలయ ఉద్యోగి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాంతారెడ్డి, కరస్పాండెంట్ జయరంగారెడ్డి, డైరెక్టర్ ముత్యాల రెడ్డి, లెక్చరర్ శ్రీకరం గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇయర్' వేడుకలు ప్రశాంతంగా చేసుకోండి

యల్లనూరు: న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలని పుట్లూరు సీఐ సత్యబాబు సూచించారు. శనివారం సీఐ మాట్లాడుతూ డిశంబరు 31వ తేదీ రాత్రి మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి గొడవలు పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలు అదుపు తప్పితే ఎంతటివారిపైనైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కోమటికుంట్ల చెరువుకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని పుట్లూరు చెరువు నుంచి కోమటికుంట్ల చెరువుకు శనివారం నీరు విడుదల చేశారు. పుట్లూరు చెరువుకు పూర్తి స్థాయిలో నీరు రావడంతో నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ చైర్‌పర్సన్ ప్రమీలమ్మ, హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, డీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహ కుటుంబానికి శనివారం అసోసియేషన్ నాయకులు రూ.61130 ఆర్థిక సాయం అందచేశారు. అనంతపురం జిల్లా డ్రైవర్లు చందాలు వేసుకుని ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో న్యూ ఏహెచ్‌ఎంపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ, గుత్తి రెస్క్యూ టీం అధ్యక్షుడు నూర్‌బాషా, స్టేట్ జాయింట్ సెక్రటరీ బాలక్రిష్ణ పాల్గొన్నారు.

బావితరాలకు వినియోగించుకోరూ..



అపరిశుభ్రంగా ఉన్న పీర్ల బావి

- చెత్తాచెదారం, కంప చెట్లతో నిండిన పురాతన బావులు
- పునరుద్ధరించాలని ప్రజల వినతి

గుత్తి: పట్టణంలోని అతి పురాతన బావులు అధ్వానంగా తయారయ్యాయి. చెత్తా చెదారం పేరుకుపోయింది. కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో బావులు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. వివరాలు,, గుత్తిలో నాగుల బావి, పీర్ల బావి, రాజా బావి, బెనకల బావి, కందకం, గోపాలం, కుంట బావి తదితర బావులు అపరిశుభ్రంగా మారిపోయాయి. ఈ బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటే చుట్టు పక్కల బోర్లలో నీరు పుష్కలంగా లభించేది. అయితే రానురానూ బావులు పూడిపోయే పరిస్థితి దాపురించింది. ఇప్పటికే ఎంతో పురాతనమైన కుక్కల బావి, కండోజి బావితో పాటు మరో ఐదు బావులు పూడ్చి వేశారు. ఆక్రమణ దారులు బావులను పూడ్చి వేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేసుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఉన్న బావులైనా బాగు చేస్తారనుకుంటే అదీ లేదు.ఇలాగే వదిలేస్తే బావులు పూడిపోయి తాగునీటి సమస్య తలెత్తే అవకాశముంది. అలాగే బోవుల చుట్టూ రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావులను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకురావడంతోపాటు రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పురాతన బావులను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఒక బావిని శుభ్రం చేయించాం. త్వరలో అన్ని బావులను శుభ్రం చేయిస్తాం. బావులను వినియోగంలోకి తీసుకొస్తాం.
–జబ్బార్ మియా, మున్సిపల్ కమిషనర్, గుత్తి

బావులను శుభ్రం చేయాలి



గుత్తిలో పురాతన బావులు చాలా ఉన్నాయి. గుత్తి కోట సంరక్షణ సమితి బావులను పరిరక్షించడానికి సిద్ధంగా ఉంది. అయితే మున్సిపల్ అధికారులు స్పందించి బావుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.
–విజయభాస్కర్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు

పురాతన బావులను కాపాడాలి



పురాతన బావులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై తీసుకోవాలి. బావులు ప్రకృతి సంపద. ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మొదట బావులను శుభ్రం చేయించాలి.
–బాబా సాహెబ్, గుత్తి.

బావులు ఆక్రమిస్తున్నారు



బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటే నీటి కొరత ఏర్పడదు. ఇప్పటికే అనేక పురాతన బావులు కనుమరుగయ్యాయి. ఆక్రమణ దారులు బావులను పూడ్చి భవనాలు నిర్మించుకున్నారు. ఉన్న బావులైనా కాపాడుకోవాలి.
–రమేష్, కోట గైడ్ గుత్తి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న ఎస్టీ సెల్ నాయకులు

శింగనమల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా శింగనమల నియోజకవర్గానికి చెందిన ఆయన ఇటీవల నియామకమవడంతో.. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానించారు. ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని, వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని ఆలూరు సాంబశివారెడ్డి ఆయనకు సూచించారు. కార్యక్రమంలో బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ-ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో అనంతపురం రోడ్డుపై శనివారం రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కల్లూరుకు చెందిన శ్రీనివాసులు పని మీద బైక్‌లో గుత్తికి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొనింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

శ్రీకృష్ణ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

గార్లదిన్నె: మండల కేంద్రంలో శ్రీకృష్ణ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ, జనసేన నాయకులు కోరారు.శనివారం వారు మాట్లాడుతూ గార్లదిన్నెలో ఐకమత్యంతో శ్రీకృష్ణ విగ్రహం ఏర్పాటు చేసుకుంటామన్నారు. అలాగే బలిజ సంఘం కమిటీ హాల్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, మురళీకృష్ణ, కృష్ణమూర్తి, రాఘవేంద్ర, రాజా, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఏఓను సస్పెండ్ చేయాలి

గుంతకల్లుటౌన్: ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగ, కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న ఏఓ రామ్‌ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ బి.సురేష్ డిమాండ్ చేశారు. ఏఓపై న్యూడెమోక్రసీ పార్టీ నాయకులిచ్చిన ఫిర్యాదుపై స్పందించిన డీసీహెచ్‌ఎస్ సమగ్ర విచారణకు నియమించిన కమిటీ అధికారులు శనివారం ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా విచారణాధికారి డాక్టర్ దివాకర్‌ను న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆస్పత్రిలో అవినీతి, అక్రమాలకు పాల్పడటమే కాకుండా మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అతనిపై కఠిన చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఏఓపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు నాగరాజు, రమేష్ విచారణాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న దళిత ఉద్యోగినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఏఓను సస్పెండ్ చేయకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని దళిత సంఘాల నేతలు జింకల జగన్నాథ్, భీమలింగ, మహేంద్ర, రామాంజినేయులు, కోరి చంద్రశేఖర్ హెచ్చరించారు. ఏఓను సస్పెండ్ చేయాలని ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విచారణాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ విచారణాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.



విచారణాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు



ఏఓ రామ్‌ప్రసాద్ దిష్టిబొమ్మతో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘాలు

నిష్పక్షపాతంగా విచారణ చేపడతాం

ఏఓ రామ్‌ప్రసాద్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు, లైంగిక వేధింపులపై నిష్పక్షపాతంగా సమగ్రమైన విచారణ చేపట్టి నివేదికను డీసీహెచ్‌ఎస్‌కు అందజేస్తామని విచారణాధికారి డాక్టర్ టీఎస్.దివాకర్ అన్నారు. ఏఓ రామ్‌ప్రసాద్, ఉద్యోగులను వేర్వేరుగా విచారించడంతో పాటు రికార్డులను పరిశీలించారు. విచారణ కమిటీ సభ్యులు దొరైస్వామి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంఎస్ తరలింపు' ఉపసంహరించుకోవాలి

గుంతకల్లు: పట్టణంలోని ఆర్‌ఎంఎస్ తరలింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మోదీనాబాద్‌లోని ఆర్‌ఎంఎస్ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులు చేపట్టిన రిలే దీక్షలకు పట్టణ వైఎస్సార్‌సీపీ శ్రేణులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.గాదిలింగేశ్వరబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప, మున్సిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు బి.సుంకప్ప మాట్లాడారు అన్ని ప్రాంత్రాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతోపాటు డివిజన్ కేంద్రం కావడంతో ఆర్‌ఎంఎస్‌ను గుంతకల్లులో ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఆ కేంద్రాన్ని అనంతపురానికి తరలించడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆర్‌ఎంఎస్ తరలింపును అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాటిల్ యుగంధర్‌రెడ్డి, కౌన్సిలర్ చాంద్‌బాషా, నాయకులు వీరేష్, మార్కెట్ వెంకటేశులు, నూర్‌నిజామి, బావన్న, షాబుద్దీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష పరులకు మద్దతుగా కూర్చున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన అనిల్ కుమార్‌ను పోక్సో కేసులో శనివారం రాత్రి డీఎస్పీ శ్రీనివాసులు అరెస్టు చేశారు. వివరాలు.. ఆర్‌ఎస్‌కు చెందిన అనిల్‌కుమార్ ఆర్‌ఎస్‌కే చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అనిల్ కుమార్‌పై నెల క్రితం పోలీసులు పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండకు చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ కేశవాపురానికి చెందిన ఓ బాలికను కొప్పలకొండకు చెందిన సుదీర్ అనే యువకుడు వివాహం చేసుకుంటానని గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడన్నారు. బాలిక తల్లిదండ్రు ఫిర్యాదు మేరకు సుధీర్‌పై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

బీఎస్పీ నాయకుడి మృతి



వెంకటనారాయణ (ఫైల్)

పెద్దవడుగూరు: మండల కేంద్రానికి చెందిన బీఎస్పీ సీనియర్ నాయకుడు వెంకటనారాయణ అనారోగ్యంతో కడప నిమ్స్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు చేశాడని గుర్తుచేసుకున్నారు. ఆదివారం అరిటామలం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కందిని మద్దతు ధరతో విక్రయించుకోండి

గార్లదిన్నె: కంది దిగుబడిని రైతులు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలని అనంతపురం వ్యవసాయ శాఖ ఏడీ రవి సూచించారు. శనివారం మండలంలోని కోటంకలో రైతులు సాగు చేసిన కంది, ఉలవ తదితర ప్రత్యామ్నాయ పంటలను ఏడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా జనవరి నుంచి క్వింటా ధర 7,550తో కందులు కొనుగోలు చేస్తుందన్నారు. మండల కేంద్రంలోనే కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఏఓ సోమశేఖర్, వీహెచ్‌ఏ హరిత పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలని వినూత్న నిరసన

గుంతకల్లు: ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ స్పందించాలని విద్యార్థులతో కలసి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శనివారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు బేల్దారి పనులు చేస్తూ, కురగాయలు అమ్ముకుంటూ, ఇతర సపేలే చేస్తూ వినూత్న నిరసన చేవారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన వెంటనే విడుదల చేయాలన్నారు. లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్, నాయకులు రోహిత్, శివమణి, షేక్షావలి, సమీర్, రాజేష్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నిందితుల ఇళ్ల తనిఖీ

తాడిపత్రి రూరల్: మండలంలోని రావివెంకటాంపల్లిలో అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎస్‌ఐ ధరణిబాబు, సిబ్బంది తనిఖీలు చేశారు. ప్రధానంగా వంశీ కుమార్ హత్య కేసులోని నలుగురు నిందితుల ఇళ్లు, పరిసర ప్రాంతాలనుపరిశీలించారు. గతంలో ఉన్న బెల్ట్‌షాపు రూంను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని ఎస్‌ఐ సూచించారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణ

బుక్కరాయసముద్రం: తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అన్నేరి ఆదినారాయణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు గాంధీ నగర్‌లో సర్వే నెంబర్ 445, 446లో 3.50 ఎకరాల్లో భూమి ఉందన్నారు. ఆ భూమికి ఆనుకుని హోటల్ పెట్టుకుని జీవనాధారం చేసుకుంటుంటే.. రోడ్డు ఆక్రమించాడని కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెప్పించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తనను ఇబ్బందులకు గురిచేస్తే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

పెద్దవడుగూరు: మండల కేంద్రం పెద్దవడుగూరులోని పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఏకరూపు దుస్తులను ఎంపీడీఓ నరసింహారెడ్డి శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్మికులకు సకాలంలో వేతనాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, సిబ్బంది జయరాముడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

గుంతకల్లుటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, న్యూడెమోక్రసీ పార్టీ పట్టణ కార్యదర్శి రామ్‌దాస్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. అమిత్‌షా రాజీనామా చేయాలని, దేశప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ నెల 30న పట్టణంలో వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన ర్యాలీకి ప్రజలు తరలిరావాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఆయా పార్టీల నాయకులు నాగరాజు, రమేష్, గౌస్, రాము, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పామిడిలో సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని ఆయా పార్టీల నాయకులు పీ అనిమిరెడ్డి, కే రహీమ్ శనివారం తెలిపారు. అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వాఖ్యలు నిరసిస్తూ ర్యాలీ చేపట్టామన్నారు.



గుంతకల్లులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శ్రీనివాసులు

తాడిపత్రి అర్బన్: పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిషా రాజీనామా చేయాలని సీపీఎం, సీపీఐ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగయ్య, సీపీఎం ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరి అమిత్‌షా వ్యాఖ్యలతో బట్టబయలైందని, రాజ్యాంగ నిర్మాతకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 30న నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, కుళ్లాయప్ప, ఉమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

గుత్తి రూరల్/పామిడి/యల్లనూరు: గుత్తి మండలంలోని తొండపాడు, జక్కలచెరువు గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారని తహసీల్దార్ ఓబులేసు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 8 వరకూ సదస్సులు నిర్వహించి, అనంతరం రైతుల నుంచి అందిన వినతులకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సురేంద్ర, సర్వేయర్ సాయి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని అనుంపల్లి, ఖాదర్‌పేట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణస్వామి, కే సుశీలమ్మ, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఈఓ క్రిష్ణయ్య, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండలంలోని పాతపల్లి, కాచర్లకుంట గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా, ఆర్‌ఐ నారాయణమ్మ, సర్వేయరు శర్వాణీ, వీఆర్వోలు పాల్గొన్నారు.



గుత్తి మండలం తొండపాడులో తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు